


# నంద్యాల జిల్లాలో ఆర్టీఈ- 2009

# అమలు ఎక్కడ..?

## పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్ల నో ఎంట్రీ

- ప్రైవేట్ స్కూళ్ల దౌర్జన్యం
- ఆర్టీఈ విద్యార్థులకు అన్యాయం
- జిల్లాలో అమలు కాని ఆర్టీఈ-2009.
- సీట్లు ఇవ్వకుండా తిప్పి పంపిస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు
- లబోదిబోమంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు.
- విద్యా శాఖ మంత్రి ఆదేశాలకు విలువ లేదా..?జిల్లాలో ఆర్టీఈపై నిర్లక్ష్యం.
- "25 శాతం ఉచిత ప్రవేశాలు ఎక్కడ..?అంటూ విద్యార్థి సంఘాల ఆగ్రహం.
- సీట్లు ఇవ్వకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తాం.
- నంద్యాల విద్యార్థి సంఘాల జేఏసీ హెచ్చరిక.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 25:** నంద్యాల జిల్లాలో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సిన "రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్టీఈ) 2009" చట్టం కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రభుత్వాలు గొప్పగా ప్రచారం చేస్తున్న ఆర్టీఈ అమలు జిల్లాలో పూర్తిగా విఫలమైందని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.ఆర్టీఈ కింద ఆన్‌లైన్‌లో సెలెక్ట్ అయిన విద్యార్థులకు ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలు సీట్లు కేటాయించకుండా తల్లిదండ్రులను వెనక్కి పంపిస్తున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కేటాయించాల్సి ఉన్నా,చాలా విద్యాసంస్థలు ఆ నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయని విద్యార్థి సంఘాల జేఏసీ ఆరోపించింది."సీట్లు లేవు..మేనేజ్‌మెంట్ ఆర్డర్లు లేవు..తర్వాత రండి.." అంటూ తల్లిదండ్రులను రోజుల తరబడి చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది.

ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా ఆర్టీఈ కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా,జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు వాటిని పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి."ప్రభుత్వ ఆదేశాలకే విలువ లేకపోతే పేదల పిల్లలకు న్యాయం ఎక్కడ..?"అని ప్రశ్నిస్తున్నాయి.



నంద్యాలలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ,ఎస్టీ,విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఒంకిరి రామచంద్రుడు,ఎస్సీ సెల్ నాయకులు విజయభాస్కర్,పిడిఎస్యు జిల్లా కార్యదర్శి రాంబాబు,జీ.వీ.ఎస్ రాయలసీమ అధ్యక్షుడు రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.."ఆర్టీఈ చట్టం పేద విద్యార్థులకు వరం కావాలి గానీ,ప్రైవేట్ స్కూళ్లకు ఆదాయ మార్గం కాకూడదు.సెలెక్ట్ అయిన విద్యార్థులకు వెంటనే సీట్లు కేటాయించాలి.లేకపోతే విద్యాశాఖ కార్యాలయాల ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు.

అలాగే పాఠశాలలు "లోకల్ అడ్రెస్, డాక్యుమెంట్లు,అదనపు ఫీజులు" పేరుతో కొత్త నిబంధనలు పెడుతూ పేద కుటుంబాలను భయపెడుతున్నాయన్నారు. కొన్ని స్కూళు "అధికారుల లేఖ తీసుకురండి","మేనేజ్‌మెంట్ లెటర్ కావాలి","రిఫరెన్స్ లెటర్ తీసుకురండి"వంటి కారణాలు చెబుతూ అడ్మిషన్లు నిరాకరిస్తున్నాయని ఆరోపించారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్"ను కచ్చితంగా అమలు చేయాలని,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి,ఆర్టీఈ కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి సీటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల పిల్లలకు విద్య హక్కా?లేక కార్పొరేట్ స్కూళ్ల కరుణా..? అన్న ప్రశ్న ఇప్పుడు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.